# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ❖ రాష్ట్రంలో ప్రతీ ఇంటి నుండి ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.
- ❖ విశాఖపట్టణంలో లైట్ హౌస్ ఫెస్టివల్ రేపటి నుండి ప్రారంభం కానుంది.
- ❖ ఆగ్నేయ బంగాళాఖాతంలోని అల్పపీడనం వాయుగుండంగా బలపడిందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================

గుంటూరులో జరుగుతున్న గ్రామీణ కళాకారుల సంఘు వస్తువుల విక్రయం (సరస్) మేళా-2026 కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొద్దిసేపటి క్రితం హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించిన ముఖ్యమంత్రి నిర్వాహకులతో మాట్లాడి వారి వ్యాపారాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ 36 సెకన్లు)

ముఖ్యమంత్రితో పాటూ కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కూడా మేళాకు హాజరయ్యారు. దేశం నలుమూలల నుండి 600 మందికి పైగా చేనేత, హస్త కళాకారులు, సాంస్కృతిక కళాకారులు ఈ మేళాలో పాల్గొని సాంప్రదాయ, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, ఆభరణాలు, గృహ అలంకరణ వస్తువులు, ఉత్పత్తులను ఈ నెల 18 వరకు జరగనున్న ఈ మేళాలో ప్రదర్శించనున్నారు.

=====================

ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు జరిగిన సమావేశంలో కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సమావేశం అనంతరం ఆ వివరాలను రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వెల్లడించారు. 35కు పైగా అజెండా అంశాలకు ఈ మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించిందని చెప్పారు. కృష్ణానది తీరంలో మెరీనా ప్రాజెక్టు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని, గ్రామీణ ప్రాంతాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా నీటి సరఫరాకు 5 వేల కోట్ల రూపాయల రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారెంటీపై కూడా చర్చించామన్నారు. ఇటీవల జరిగిన పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. వచ్చే ఐదేళ్లలో ప్రతీ నియోజకవర్గంలో 7 వేల 500 మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా MSME ప్రతిపాదించిన ఏపీ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను కేబినెట్ ఆమోదించిందని మంత్రి పార్థసారథి తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

=====================

విశాఖపట్టణం బీచ్ రోడ్ లోని ఎంజీఎం పార్కులో లైట్ హౌస్ ఫెస్టివల్ రేపటి నుండి ప్రారంభం కానుంది. విశాఖ వైభవాన్ని మరింత చాటి చెప్పడంతో పాటు సముద్ర వారసత్వాన్ని ప్రోత్సహించడం, లైట్ హౌస్ టూరిజాన్ని విస్తరించడం, తీర ప్రాంత ప్రజలను భాగస్వామ్యులను చేయడం లక్ష్యంగా ఈ ఫెస్టివల్ ను కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక ప్రదర్శనలు, ఇతర విశేషాలతో కూడిన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ ఫెస్టివల్ కు పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తో పాటూ జిల్లాకు చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారు. గతంలో గోవా, పూరీ నగరాల్లో లైట్ హౌస్ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించిన అనుభవాలను పరిగణనలోకి తీసుకొని విశాఖలో ఈ సారి మరింత వైభవంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశామని సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు.

విరామం

=====================

సముద్ర తీర ప్రాంతాల్లో క్షీణిస్తున్న మడ అడవులను పునరుద్ధరించి ఆ ప్రాంతాల్లో నివసించే ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడమే మిష్టీ (మాంగ్రోవ్ ఇనీషియేటివ్) పథకం ప్రధాన ఉద్దేశ్యమని నేషనల్ క్యాంపా (CAMPA) ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆనంద్ మోహన్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర అటవీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మిష్టీ పథకంపై రెండు రోజుల జాతీయ కార్యశాలను విజయవాడలో ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సముద్ర తీర ప్రాంతాల్లో క్షీణిస్తున్న మడ అడవులను రక్షించి, సముద్రం కోతకు గురి కాకుండా కాపాడటమే లక్ష్యంగా మిష్టీ పథకం పని చేస్తుందన్నారు. దీనిని సుమారు రెండున్నర ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మడ అడవులు ప్రకృతి సిద్ధమైన రక్షణ గోడలా పనిచేసి తుఫానులు, ఉప్పెనల వంటి ప్రకృతి వైపరీత్యాల నుండి తీర ప్రాంతాలను కాపాడతాయన్నారు. మడ అడవుల క్షీణత వల్ల భూగర్భ జలాల్లో ఉప్పు నీరు చేరి వ్యవసాయ భూములు దెబ్బతింటున్నాయన్నారు. వీటిని కాపాడుకోవడం వల్ల స్థానిక రైతుల భూములు సురక్షితంగా, సారవంతంగా ఉంటాయన్నారు.

=====================

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చి 18 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై డీఆర్ఓ కె. హేమలత అధ్యక్షతన జిల్లా సమన్వయ కమిటీ సమావేశం ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని 33 పరీక్షా కేంద్రాలల్లో పరీక్షలు జరగనున్నాయని, 5 వేల 446 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. ప్రతి కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తుతో పాటు.. 144 సెక్షన్ అమలు చేయాలని

పోలీసు అధికారులను ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, లైవ్ స్ట్రీమింగ్ ద్వారా కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షించాలన్నారు.

=====================

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 12వ తేదీన నృసింహదీక్షల విరమణ ప్రారంభమవుతుందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ సంవత్సరం మండల దీక్షలను స్వీకరించిన దీక్షాపరులు 12 తేదీ సోమవారం ఉదయం 6 గంటల 30 నిమిషాల నుండి కొండపైన పడమర మాడ వీధి, నృసింహమండపం ద్వారము గుండా ప్రధాన ఆలయం చేరుకొని దర్శనం చేసుకోవడానికి, ఆ తరువాత దక్షిణ రాజగోపురం ద్వారా బయటకు వచ్చి శ్రీ గోకులం వద్ద ఏర్పాటు చేయబడిన వేదిక వద్ద స్వాములు ఇరుముడి సమర్పించుటకు సమగ్ర ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. సదరు వేదిక వద్ద ఇరుముడు స్వాములకు ప్రసాద వితరణ ఏర్పాటు చేయడమైనదని, దూరప్రాంతాల నుండి వచ్చే స్వాములకు ముందు రోజు నుండే ఉచిత రవాణా, వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని కార్యనిర్వాహణాధికారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

=====================

ఆగ్నేయ బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాలలో నిన్నటి అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా బలపడి ఈరోజు చెన్నైకి ఆగ్నేయంగా 980 కిలో మీటర్ల దూరంలోనూ, శ్రీలంకకు తూర్పు-ఆగ్నేయంగా 410 కిలోమీటర్ల దూరంలోనూ కేంద్రీకృతమై ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో నైరుతి బంగాళాఖాతం మీదుగా పశ్చిమ-వాయువ్య దిశగా ప్రయాణించి రేపు సాయంత్రం హంబన్‌తోట, కల్ముNai మధ్య శ్రీలంక తీరాన్ని దాటే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో శనివారం రాష్ట్రంలో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది.

=====================

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. ఈ పథకానికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సమావేశం నెల్లూరులో ఆయన అధ్యక్షతన ఈరోజు జరిగింది. ఈ పథకం కోసం కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 560 మంది లబ్ధిదారులను సమావేశంలో ఎంపిక చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న మత్స్యకారుల వద్దకు వెళ్లి.. ఈ పథకం ప్రయోజనాలను పూర్తి స్థాయిలో వివరించాలన్నారు.

=====================
=====================